
సాక్షి ఖమ్మం

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



వేసవిలోనూ పోషకాహారం..

వేసవిలోనూ చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తెరవనున్నారు. 8లో



ఘనంగా ఈస్టర్ వేడుకలు

యేసుక్రీస్తు పునరుత్థానం అయిన రోజును పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. 9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
40° / 26°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం తర్వాత జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష హాల్‌టికెట్లను http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సోమవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ సూచించారు. ఆరో తరగతి విద్యార్థులకు ఈనెల 27న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7–10వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

ఖమ్మం రాపర్తినగర్: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు ఆసక్తి, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో సూచించారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి 21–38 ఏళ్ల వయస్సు ఉండాలని, కనీసం మూడేళ్ల పాటు అనుభవం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈమేరకు దరఖాస్తులను 25వ తేదీలోగా germanytriplewin2025@gmail.com మెయిల్‌కు పంపించాలని, వివరాలకు 94400 51581, 94400 48500, 94400 52081 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పదో తరగతి పరీక్షలకు 488 మందికి గాను 420 మంది హాజరు కాగా 68 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షకు 646 మందికి గాను 575 మంది హాజరు కాగా, 71మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా మద్దినేని పాపారావు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వారు పేర్కొన్నారు. కాగా డీఈఓతో పాటు డీఐఈఓ రవిబాబు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

25న ఉద్యోగుల సదస్సు

టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

ఖమ్మం సహకారనగర్ : జిల్లా తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో ఈనెల 25న ఉద్యోగుల సదస్సు నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు టీఎన్జీఓస్ ఫంక్షన్ హాల్‌లో సదస్సు ఉంటుందని, 4 గంటలకు కలెక్టరేట్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సదస్సుకు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తదితరులు హాజరవుతారని తెలిపారు కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, తుంబూరు సునీల్‌రెడ్డి, విజయ్, వీరస్వామి, కొణిదన శ్రీనివాస్, మోదుగు వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన కల్పించాలి



ముదిగొండ : వల్లభి చెక్ పోస్టులో రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి : భూ భారతి చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని రాయగూడెం, బోదులబండ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గ్రామ సభలను ఆయనతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి పరిశీలించారు. రిజిస్టర్ల నమోదును తనిఖీ చేసి, ఏ సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని ఆరా తీశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు తమ భూముల విషయంలో జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్‌ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి, నాయకులు బోయిన వేణు, సూరేపల్లి రామారావు, తీగ రమణయ్య, పఠానాపు నాగయ్య పాల్గొన్నారు.

వల్లభిలో చెక్‌పోస్టు తనిఖీ..

ముదిగొండ : మండల పరిధిలోని వల్లభి చెక్ పోస్టును అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. తెలంగాణ-ఏపీ సరిహద్దులో చెక్ పోస్టు ఉండగా, రికార్డులు పరిశీలించి, విధుల్లో ఉన్న వారి వివరాలు సేకరించారు. చెక్ పోస్టు వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మార్కెట్ వివరాలు సక్రమంగా రికార్డులో నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రన్ రాజా.. రన్!

వేలాది మంది క్రీడాకారులకు ఓనమాలు నేర్పడమే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వేదికగా నిలిచిన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి రానుంది. రూ.6.65 కోట్ల వ్యయంతో ట్రాక్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. మట్టి ట్రాక్‌లో శిక్షణ పొందుతూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న క్రీడాకారులకు కొత్త ట్రాక్ అందుబాటులోకి వస్తే అత్యుత్తమ ప్రతిభ చాటే అవకాశముందని చెబుతున్నారు.

– ఖమ్మం స్పోర్ట్స్



పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్

- రూ.6.65కోట్ల నిధులతో పనులు ప్రారంభం
- మూడు నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ

ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు

ఖమ్మంలో అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటై రెండు దశాబ్దాలు గడుస్తుండగా.. స్టేడియంలో ఇన్నాళ్లు సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి అడుగులు పడలేదు. జిల్లా క్రీడాశాఖ అధికారులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు చొరవ చూపినా ఫలితం కానరాలేదు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్ మంజూరు చేసినా నిధులు మాత్రం కేటాయించలేదు. అంతేకాక ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడే సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ భావించినా నిధుల లేమి వేధించింది. ఇంతలోనే ట్రాక్ ప్రతిపాదిత స్థలాన్ని క్రికెట్ శిక్షణకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. ఇలా రకరకాల అడ్డంకులతో ట్రాక్ నిర్మాణం ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్న చందంగా మారింది.



సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు..

పట్టుబట్టడంతో...

గత రెండేళ్లుగా జిల్లా క్రీడల శాఖ, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు సింథటిక్ ట్రాక్ కోసం పట్టుబట్టారు. స్టేడియంలో మట్టిట్రాక్‌పై శిక్షణ పొందిన అబ్దుల్ నజీబ్‌ఖురేషి, పవన్‌కుమార్, సుధాకర్ తదితరులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారు. మరి కొందరు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. ఇక్కడ అకాడమీకి తోడు అనుభవం కలిగిన కోచ్ ఉన్నందున సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందుతుందనే భావనతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇవ్వగా, ఆయన ట్రాక్ ఏర్పాటుపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మున్సిపల్ శాఖ అధికారులతో చర్చించి నిధుల కేటాయింపునకు సూచనలు ఇచ్చారు. ఈమేరకు ఏళ్లుగా క్రీడాకారులు ఎదురుచూస్తున్న సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఈ ట్రాక్‌ను మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మూడు నెలల్లో అందుబాటులోకి..



పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తిచేస్తాం. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రాగానే పనులను అధికారికంగా ప్రారంభిస్తాం. సింథటిక్ అందుబాటులోకి వస్తే అథ్లెట్లకు మెరుగైన శిక్షణ అందుతుంది.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్ఓ

జాతీయస్థాయిలో సత్తా...



ఇక్కడ అథ్లెట్లకు సరైన వసతులు లేక జాతీయస్థాయిలో రాణించలేకపోతున్నారు. సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే ఉత్తమ శిక్షణ అందుతుంది. తద్వారా మన క్రీడాకారులను భారత జట్టులో స్థానం పొందేలా తీర్చిదిద్దుతాం.

– ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్

సన్న బియ్యానికి సై!

- ఈనెల 1 నుంచి రేషన్ దుకాణాల్లో పంపిణీ
- బియ్యం తీసుకునేందుకు ఆసక్తి చూపిన లబ్ధిదారులు
- జిల్లాలో 86 శాతం మందికి సరఫరా
- పోర్టబిలిటీతో కలిపి 90 శాతం వరకు అమ్మకాలు
- గ్రామాల్లో షాపుల వద్ద క్యూ కడుతున్న కార్డుదారులు



ఖమ్మంలోని ఓ రేషన్‌షాప్ వద్ద బారులుదీరిన జనం.. (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన సన్నబియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరిచారు. ఈనెల 1 నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభం కాగా.. నిత్యం రేషన్ దుకాణాల వద్ద క్యూ కట్టడం కనిపించింది. జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉండగా.. 86.27 శాతం మంది ఈనెలలో బియ్యం తీసుకున్నారు. ఆయా షాపులకు చేరిన 7,375 మెట్రిక్ టన్నుల బియ్యంలో 6,276 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ పూర్తయింది. ఇక పోర్టబిలిటీతో కలిపి 90.26 శాతం మేర సన్నబియ్యం పంపిణీ జరిగింది. గతంలో దొడ్డు బియ్యం తీసుకునేందుకు చొరవ చూపని లబ్ధిదారులు.. ఈసారి సన్నబియ్యం రావడంతో అధిక సంఖ్యలో తీసుకున్నారు. దీంతో రేషన్‌దుకాణాల్లో అమ్మకాలు పెరిగాయి. ప్రస్తుతం షాపుల్లో 10 శాతం నిల్వలు మాత్రమే ఉన్నాయి.

దొడ్డు బియ్యం అంతంతే..

ప్రభుత్వం గత నెల వరకు రేషన్ దుకాణాల ద్వారా దొడ్డుబియ్యం పంపిణీ చేసింది. అయితే ఈ బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు అంతగా ముందుకు రాలేదు. అవి తినేందుకు అనుకూలంగా లేకపోవడంతో తక్కువ మంది మాత్రమే తీసుకెళ్లేవారు. వారిలోనూ కొందరు పిండి పట్టించడం లేదా ఇతరులకు అమ్మడం వంటివి చేసేవారు. కొందరు రేషన్‌కార్డుదారులైతే ఏళ్ల తరబడి షాపులకు రావడమే మానేశారు. దీంతో పేదల ఆకలి తీర్చాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. బియ్యం నిల్వలు పెరగడంతో అక్రమ రవాణాకు దారితీసేవి. కొందరు లబ్ధిదారులు బియ్యానికి బదులు డీలర్ల వద్ద డబ్బు తీసుకోవడంతో పేదల బియ్యం పక్కదారి పట్టాయి. అనేక చోట్ల ఇతర ప్రాంతాలకు లారీల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్న ఘటనలు కోకొల్లలు.

మొదటి రోజు నుంచే ఆసక్తి..

ఈనెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైంది. గతంలో రేషన్ పంపిణీ ప్రారంభమైన కొన్ని రోజుల తర్వాతే లబ్ధిదారులు బియ్యం తీసుకునేవారు. అయితే సన్న బియ్యం ఎలా ఉన్నాయో చూడాలనే ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపారు. ఆ బియ్యాన్ని వండిన వారు భోజనం బాగుందని చెప్పడంతో మిగిలిన వారు సైతం దుకాణాల బాట పట్టారు.

86 శాతం అమ్మకాలు..

జిల్లాలోని 748 రేషన్ దుకాణాల్లో బియ్యం అమ్మకాలు పూర్తయ్యాయి. జిల్లాలో 4,10,988 రేషన్ కార్డులు ఉండగా.. 3,54,573 కార్డుల వారు బియ్యం తీసుకున్నారు. మొత్తంగా 86.27 శాతం అంటే 6,276 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు చేరాయి. ఇక పోర్టబిలిటీతో కలిపి 90.26 శాతం అయింది. గతంలో 70 శాతం వరకు మాత్రమే బియ్యం పంపిణీ జరిగేది. 30 నుంచి 40 శాతం బియ్యం నిల్వలు ఉండేవి. అయితే ఈసారి కేవలం 10 శాతం మాత్రమే నిల్వలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో 1099.785 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ ఉంది. ఇవి కూడా మృతిచెందిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి సంబంధించినవేనని అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో నిల్వలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం దాదాపు అందరూ బియ్యం తీసుకున్నారు.

అంతటా సన్నబియ్యమే..

గతేడాది వానాకాలం నుంచి రైతులు సన్న రకం ధాన్యం పండించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సన్న ధాన్యం పండించిన వారికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో అత్యధిక విస్తీర్ణంలో ఈ పంటలు సాగయ్యాయి. దీంతో వసతిగృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతో పాటు రేషన్ దుకాణాల్లోనూ సన్న బియ్యం పంపిణీ చేయడానికి అవకాశం లభించింది. ముందుగానే ఏడాదికి సరిపడా నిల్వలు సేకరించిన ప్రభుత్వం.. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి రంగం సిద్ధం చేసింది. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ సన్నబియ్యాన్నే వినియోగిస్తున్నారు. అటు రైతులకు బోనస్‌తో పాటు ఇటు లబ్ధిదారులకు సన్నబియ్యం అందుతున్నాయి. ప్రస్తుత యాసంగిలోనూ ఎక్కువ మంది రైతులు సన్న ధాన్యాన్నే సాగు చేయగా రేషన్ దుకాణాల్లో ఈ బియ్యం పంపిణీ కొనసాగనుంది.

జిల్లాలో రేషన్ దుకాణాలు	మొత్తం రేషన్‌కార్డులు	బియ్యం తీసుకున్న కార్డుదారులు	పంపిణీ చేసిన బియ్యం	నిల్వ ఉన్న బియ్యం
748	4,10,988	3,54,573	6,276 మెట్రిక్ టన్నులు	1,099 మెట్రిక్ టన్నులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- రూ.72.33 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన
- వైరా నదిపై ఎత్తిపోతల పథకం ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ తదితరులు

మధిర: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, పనులు నాణ్యతగా ఉండేలా దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.72.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. తొలుత సిరిపురం గ్రామానికి చేరుకున్న భట్టికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామస్తులు, పార్టీ శ్రేణులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలు అడుగుతూ ముందుకు సాగిన ఆయన.. రూ.4.71కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన సముదాయానికి, రూ.11.37 కోట్లతో నిర్మించే ఐటీఐ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత మహదేవపురం వద్ద వైరా నదిపై రూ.12.13 కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం రాయపట్నంలో వైరా రివర్ కుడి కాల్వపై రూ.19.06 కోట్లతో 1,079 ఎకరాలకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర నుంచి మొలుగుమాడు ద్వారా నిధానపురం గ్రామం వరకు రూ.25 కోట్లతో విస్తరిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత మధిర క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. శంకుస్థాపన చేసిన పనులన్నీ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా క్యాలెండర్ ఫిక్స్ చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, ఇరిగేషన్ సీఈ ఓ.వి. రమేష్ బాబు, కల్లూరు సర్కిల్ ఎస్ఈ జి.వాసంతి, మధిర డివిజన్ ఈఈ సీహెచ్. రామకృష్ణ, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, డీఈఈ వి.నాగబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి




సమావేశమైన బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలు

ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా , వద్దిరాజు, పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్ : తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా అని చాటి చెప్పేందుకు ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లా నేతల సమావేశం నిర్వహించారు. పార్టీ రజతోత్సవ సభల జయప్రదానికి ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణుల తరలింపుపై దిశా నిర్దేశం చేశారు. సభకు వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, భోజనాల సరఫరాతో పాటు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం తదితర అంశాలపై చర్చించారు. రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 27న ఉదయం ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని పార్టీ దిమ్మెలను ముస్తాబు చేయాలని, లేని చోట నిర్మించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఎల్కతుర్తి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియ, బానోత్ మదన్‌లాల్, బానోతు చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, దిండిగాల రాజేందర్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ముత్యాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సండే.. ఎండలు మండే

- ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో సతమతం
- ఎండ తీవ్రతకు ఇళ్లకే పరిమితమైన జనం
- పగటి వేళ రోడ్లన్నీ నిర్మానుష్యం



ఖమ్మంవ్యవసాయం : భానుడు ఉగ్రరూపం దాల్చాడు. నిన్నా మొన్నటి వరకు అకాల వర్షాలతో ఉష్ణోగ్రత కొంతమేర అదుపులోనే ఉన్నా ఆదివారం మాత్రం జిల్లాలో 40 డిగ్రీలకు పైగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. అత్యధికంగా చింతకాని, పమ్మి, బాణాపురంలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యల్పంగా గుబ్బగుర్తి, రావినూతల, నాగులవంచ, సత్తుపల్లిలో 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమవుతుండగా.. 11 గంటల వరకు తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 4 గంటల వరకు ఎండ ప్రభావం కొనసాగుతుండగా 6 తర్వాత కొంత మేర చల్లబడుతోంది.

జనం సతమతం..

ఓ వైపు ఉష్ణోగ్రతలు, మరోవైపు ఉక్కపోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఉష్ణోగ్రతలకు తోడు గాలిలో తేమ లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్నా ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఎండ తీవ్రతతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వరి, మొక్కజొన్న, మిరప, మామిడి వంటి పంట కోతలకు వెళ్లే కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటికి చేరుకుంటున్నారు. కిరాణ, ఇతర దుకాణాలకు కూడా వినియోగదారులు ఉదయం, సాయింత్రం వేళల్లోనే వెళ్తున్నారు. సాయింత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దుకాణాల్లో రద్దీ ఉంటోంది.

ఆదివారం 40 డిగ్రీలకు పైగానే..

జిల్లాలో గేటు కారేపల్లి, లింగాల, వైరాలో ఆదివారం 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఎర్రుపాలెంలో 42.6, కూసుమంచి 42.1, మధిర 42.0, పెనుబల్లి, నేలకొండపల్లి, మధిర ఏఆర్ఎస్ 41.7, రఘునాథపాలెం 41.6, ఖమ్మం నగరం ఖానాపురంలో 41.4, కలెక్టరేట్, కాకరవాయిలో 41.2, ఖమ్మం ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌస్, బచ్చోడు, పల్లెగూడెంలో 41.0, తిరుమలాయపాలెం, ముదిగొండలో 40.9, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 40.7, తల్లాడ, కుర్నవల్లిలో 40.6, సత్తుపల్లి జేవీఆర్ ఓసీపీ 1, 2, వేంసూరు, సిరిపురంలో 40.5, మంచుకొండ, పెద్దగోపతిలో 40.2, కల్లూరులో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాత్రికి ఈదురుగాలులు, వర్షం..

వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉండగా.. రాత్రి 10:15 గంటల నుంచి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం, కామేపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, వైరా, కూసుమంచి, ముదిగొండ, కొణిజర్ల, తల్లాడ, ఏన్కూరు, చింతకాని, బోనకల్ మండలాల్లో ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పగలు ఎండ, రాత్రి విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈదురుగాలులు, వర్షం యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 3,222 ఎకరాల్లో పంటలు దెబ్బతినప్పట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. ఆదివారం రాత్రి మరోసారి ప్రకృతి ప్రకోపం చూపడంతో పంటలు మరింతగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం, మొక్కజొన్న, మిర్చి కల్లాల్లో ఆరబెట్టి ఉండగా అకాల వర్షంతో తడిసి ముద్దయ్యాయి. చేతికందే దశలో ఉన్న మామిడి నేలరాలుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలువురికి కవిత పరామర్శ



ఆర్జేసీ కృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఖమ్మంమయూరిసెంటర్ : రెండు రోజుల ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం ఖమ్మం చేరుకున్నారు. ఆమెకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. వద్దిరాజు నివాసం నుంచి బయలుదేరి బీఆర్ఎస్ నాయకులు గుండాల కృష్ణ (ఆర్జేసీ) ఇంటికి వెళ్లారు. ఇటీవల అనారోగ్యంతో సర్జరీ అయిన కృష్ణను కవిత పరామర్శించారు. ఆ తర్వాత సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును పరామర్శించారు. అలాగే నగరంలో జాగృతి నాయకులు గట్టు అరుణ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులు సాయి వివేక్-పావనిని ఆశీర్వదించారు. ఆమె వెంట మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, బానోత్ హరిప్రియ, బానోత్ చంద్రావతి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విజేతలకు బహుమతుల అందజేత


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చదరగం పోటీలు ఆదివారం జరిగాయి. బహుమత్రి ప్రదానానికి ముఖ్య అతిథిగా సర్వజ్ఞ స్కూల్ చైర్మన్ నాగేంద్రకుమార్ అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారుడు, నిర్వాహకుడు, సీహెచ్.గోపి, రాష్ట్ర చెస్ అసోసియేషన్ బాధ్యులు జి.జ్యోత్స్న, డి.సాంబశివరావు, రామారావు, ఎస్.అరుణ, సాయికుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్–10 బాలురలో శివనాగసాయి, కె.నీరాజ్, అనురాగ్ ప్రకాష్, బాలికల్లో బ్రిందభావజ్ఞ, చరిత, దుర్గారాయ్, అండర్–13 బాలురలో ప్రతీక్‌సింగ్, అనిష్ సూర్య, ద్యుమన్, బాలికల్లో యశ్వితసాలిపవార్, కావ్యశ్రీ, లాస్య, అండర్–16 బాలికల్లో ఎం.వర్షిత, ఎస్.కీర్తన, హిమజ విజేతలుగా నిలిచారు.

బైక్‌లను ఢీకొన్న లారీ

ఒకరి మృతి..


హరికిరణ్ మృతదేహం

నేలకొండపల్లి: బైక్‌ను ఢీకొట్టిన లారీ.. తప్పించుకునే క్రమంలో మరో బైక్‌ను ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బోదులబండ అండర్‌పాస్ వద్ద రాజస్థాన్‌కు చెందిన, క్వారీలో పనిచేసే కూలీల బైక్‌ను లారీ ఢీకొట్టింది. అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో లారీని వేగంగా నడుపుతూ డ్రైవర్.. కొద్దిదూరంలో మరోబైక్‌ను ఢీకొట్టాడు. దీంతో మొదటి బైక్‌పై వస్తున్న రాజస్తాన్ కూలీల్లో హరికిరణ్ (36) మృతిచెందాడు. అదే ప్రమాదంలో రాజ్‌బహదూర్, రాంజీలాల్, మరో బైక్‌పై వస్తున్న తిరుమలాపురం గ్రామనికి చెందిన భూక్యా వెంకటసాయి తీవ్రంగా గాయపడ్డారు. లారీడ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. లారీడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చెన్నారంలో చోరీలు..

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నారంలో మూడు రోజుల కిందట కందగట్ల కృష్ణ, బోయినపల్లి వేణు నివాసాల్లో చోరీ జరిగింది. తలుపులు పగలగొట్టి.. బీరువాలో ఉన్న నగదును చోరీ చేశారు. రెండిళ్లలో కలిపి రూ.6 వేల వరకు నగదు చోరీకి గురవగా.. ఆదివారం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య


రాజు (ఫైల్)

నేలకొండపల్లి: ఖరీదైన మొబైల్ కొన్నందుకు తల్లిదండ్రులు మందలించారని.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని శంకరగిరితండాకు చెందిన ధరావత్ రాజు (24) రెండు రోజుల కిందట ఖరీదైన మొబైల్ కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అంత ఖరీదు పెట్టి ఎందుకు కొనుగోలు చేశావని.. పైగా ఏపని చేయటం లేదని.. తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన రాజు పురుగులమందు తాగగా కుటుంబసభ్యులు ఖమ్మం వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం


బక్కయ్య

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన 64 ఏళ్ల తుడుం బక్కయ్య కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గత నెల 20వ తేదీన కటింగ్ చేయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన బక్కయ్య తిరిగి రాలేదు. బక్కయ్య కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మోటారు చోరీ

నేలకొండపల్లి: వ్యవసాయ విద్యుత్ మోటార్లను దుండగులు చోరీ చేశారు. మండలంలోని మోటాపురం గ్రామానికి చెందిన ఏలూరి రవికుమార్‌కు చెందిన పొలం వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని దుండగలు చోరీ చేశారు. బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: ఏపీ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్‌ఐ మధుబాబు పట్టుకొని సీజ్ చేశారు. ఏపీలోని లింగాల నుంచి బోనకల్ మండలం ఆళ్లపాడు మీదుగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా ఎస్‌ఐ పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వేసవిలోనూ పోషకాహారం..

- చిన్నారులకు అందించేందుకు సన్నద్ధమవుతున్న అధికారులు
- 15 రోజులు టీచర్లు, మరో 15 రోజులు ఆయాలతో పంపిణీ
- టేక్ హోం రేషన్‌కు అవకాశమివ్వాలని కోరుతున్న సంఘాలు



అంగన్‌వాడీ కేంద్రం

ఖమ్మంవన్‌టౌన్: వేసవికాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నెలన్నర రోజులు సెలవులు ఉండనున్నాయి. కానీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పనిచేసే అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం చిన్నారులకు పౌష్టికాహారం అందించే విధంగా అంగన్వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తెరిచి ఉంచే విధంగా జిల్లా సంక్షేమశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం రానున్న మేతో పాటు జూన్‌లో పాఠశాలలు తెరిచే వరకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు సగం, సగం రోజులు అంగన్వాడీ కేంద్రాలను తెరిచి పౌష్టికాహారం అందించనున్నారు.

అధికారుల ఏర్పాట్లు

జిల్లాలో ఉన్న 1,840 అంగన్వాడీ కేంద్రాల్లో 54,712 మంది చిన్నారులు, 12,715 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. వేసవిలో సైతం చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే రేషన్‌ను ఆపకుండా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్లు, ఆయాలు ఉన్న కేంద్రాల్లో చెరి సగం రోజులు చిన్నారులకు ఆహారం అందించేలా ఆదేశాలు జారీ చేశారు. కాగా, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లాగానే తమకు సెలవులు ఇవ్వాలని పలు అంగన్వాడీ టీచర్ల, ఆయాల సంఘాలు కోరుతున్నాయి. చిన్నారులకు, గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నెలకు సరిపడా టేక్ హోం రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

టేక్‌హోం రేషన్‌కు అవకాశమివ్వాలి..



ఈ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల లాగానే వేసవి సెలవులు మాకు సైతం ఇవ్వాలి. వేసవిలో 40 డిగ్రీలకు పైగా ఎండ తీవ్రత ఉంటుండడంతో ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం టేక్‌హోం రేషన్ అందించేందుకు అవకాశమివ్వాలి. గత నెలలో ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సైతం వినతిపత్రం అందించాం. కాటం కోటేశ్వరమ్మ టీచర్, సీఐటీయూ

ఇంకా నిర్ణయం తీసుకోలేదు..



ప్రతి వేసవిలో లాగానే ఈ వేసవిలో కూడా సగం రోజులు టీచర్లు, సగం రోజులు ఆయాలు అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాం. టేక్ హోం రేషన్‌పై ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇవ్వాలని సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా మా శాఖ చర్యలు చేపడుతుంది.

కీసర రాంగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ

ఎప్‌సెట్ ఉచిత శిక్షణ

- కోచింగ్ తీసుకుంటున్న 100 మంది విద్యార్థులు
- బాల, బాలికలకు వేర్వేరుగా శిక్షణ
- పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నది. ఈ క్రమంలో విద్యతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను సైతం ఉచితంగా అందిస్తోంది. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాలురకు, అంబేడ్కర్ గురుకుల కళాశాలలో బాలికలకు ఉచితంగా ఎప్‌సెట్ కోచింగ్‌ను అందిస్తున్నారు. 100 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. వీటి పరిధిలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 468 మంది, బైపీసీ 283 మంది విద్యార్థులున్నారు. అందులో ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఎప్‌సెట్ కోచింగ్ ఇస్తున్నారు.

వేర్వేరుగా శిక్షణ

విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేసవి కాలం కావడంతో మంచినీటితోపాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థినులకు నగరంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాల, బాలురకు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శిక్షణ ఇస్తుండగా.. వీరంతా ఆయా కళాశాలల పరిధిలోని హాస్టళ్లలో ఉంటున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు శిక్షణ ఉంటోంది. ఆ తర్వాత స్టడీ అవర్స్ ఉంటాయి. శిక్షణలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

అదనపు కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లాలో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ శ్రీజ ఎప్‌సెట్ కోచింగ్ కేంద్రాలను సందర్శిస్తూ వారికి సూచనలు చేస్తున్నారు. ఉన్నత విద్య వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు, గురుకులాలకు సంబంధించిన అధ్యాపకులు బోధిస్తున్నారు. అలాగే ఒకరిద్దరు ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులను కూడా నియమిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా ఎప్‌సెట్ కోచింగ్ ఇస్తున్నాం. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచనలతో ఈ శిక్షణ అందిస్తున్నాం. ఇతర సెంటర్లలో కోచింగ్ తీసుకోలేని విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఈ కోచింగ్ ద్వారా మంచి ర్యాంక్ సాధించి ఇంజనీరింగ్ సీట్లు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. జీవితంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఇలాంటి శిక్షణ ఉపయోగపడుతుంది.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ఖమ్మం

శిక్షణలో ఎన్నో నేర్చుకుంటున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణను ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటం అభినందనీయం. మాకున్న సందేహాలు ఎప్‌సెట్ కోచింగ్ ద్వారా నివృత్తి చేసుకుంటున్నాం. శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నాం. ప్రవేశ పరీక్షలపై ఉన్న భయం తొలగిపోయింది. అధ్యాపకులు సైతం మాకు ఎన్నో అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, ప్రవేశ పరీక్షల్లో రాణిస్తాం.

– ఎస్.భానుతేజ, ఎంపీసీ, బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం..


అభివాదం చేస్తున్న నాయకులు, ముస్లింలు

పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: వక్ఫ్ సవరణ చట్టం –2025 రాజ్యాంగ వ్యతిరేకమని, దేశంలో మరో విభజనకు బీజేపీ కుట్ర పన్నుతోందని, సంఘటిత ఉద్యమాల ద్వారానే దీనిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా ఖమ్మం యూనిట్ ఆధ్వర్యంలో మహ్మద్ అసద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా జమాతే ఇస్లామి హింద్ నాయకులు మహ్మద్ సాధిక్ మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే ఊపిరి అని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు ప్రణాళికాయుతమైన కార్యాచరణ తలపెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ జాతీయ నాయకులు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. ఈ చట్టంతో బీజేపీ మత కలహాలను రెచ్చగొట్టాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ జగదీశ్, కాంగ్రెస్ నేత, మస్జిద్ ఏ ఆయేషా (సదర్) ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రషీద్, ప్రజాపంథా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ కేవీ కృష్ణారావు, పీడీఎస్‌యూ నాయకులు ఆజాద్, ఖమర్, డాక్టర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు మేలు

ఖమ్మంమామిళ్లగూడెం: వక్ఫ్ సవరణ చట్టం అమలుతో పేద ముస్లింలు, మైనార్టీ మహిళలకు మేలు చేకూరుతుందని, పాత వక్ఫ్ బోర్డు అమలు అంటే చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకోవడమేనని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌గౌడ్, హైకోర్టు న్యాయవాది, బీజేపీ రాష్ట్ర నాయకులు సుంకర మౌనిక విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణ చట్టం 2025 జన జాగరణ అభియాన్ పేరుతో ఖమ్మంలోని హోటల్ మినార్ గ్రాండ్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. తొలుత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బీజేపీ తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వక్ఫ్ బోర్డు సవరణ చట్టం వల్ల ముస్లిం మైనార్టీలకు ఒనగూరే ఉపయోగాలు, పకడ్బందీగా అమలు కాకపోతే వచ్చే నష్టాల గురించి ఫోన్ ద్వారా తెలిపారు. నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులు ముస్లిం మైనార్టీలను భయాందోళనలకు గురిచేస్తూ దేశాన్ని అగ్నిగుండంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ బోర్డు వల్ల ముస్లింలకు అన్యాయం తప్ప ఉపయోగం ఏమాత్రమూ లేదన్నారు. కార్యక్రమంలో నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, ఈవీ రమేశ్, వీరవెల్లి రాజేశ్‌గుప్తా, కొలిపాక శ్రీదేవి, ఎస్‌కే యాకూబ్‌పాషా, పమ్మి అనిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం వచ్చిన రోజే పెళ్లి చేసుకుంటా !

- జిల్లాలోని ఓ కాంగ్రెస్ కార్యకర్త స్పష్టీకరణ
- రేవంత్‌రెడ్డిని రప్పించాలంటూ వైరా ఎమ్మెల్యేకు వినతి


గణేష్ వినతిపై సీఎంను రావాలని కోరుతూ రాసిన ఎమ్మెల్యే (ఇన్ సెట్)
వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న గణేష్

కారేపల్లి: 'సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన రోజే నా పెళ్లికి ముహూర్తం ఖరారు చేస్తా' అంటూ కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన ఓ కాంగ్రెస్ కార్యకర్త అంటున్నాడు. మేకలతండాకు చెందిన భూక్యా గణేష్‌కు ఇటీవల పెళ్లి నిశ్చితార్థం అయింది. కాగా, గణేష్‌కు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అన్నా, సీఎం రేవంత్‌రెడ్డి అన్నా చాలా ఇష్టం. దీంతో రేవంత్‌రెడ్డి వస్తేనే పెళ్లి చేసుకుంటానంటూ భీష్మించాడు. ఆయనకు కుదిరిన రోజే పెళ్లి తేదీ ఖరారు చేస్తా అంటున్నాడు. ఎలాగైనా సీఎంను రప్పించాలంటూ ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందించాడు. దీంతో అతడి వినతిపై 'రెస్పెక్టెడ్ సీఎం సార్, ప్లీజ్ కైండ్లీ అటెండ్ ది మ్యారేజ్.. వెరీ వెరీ ఇంపార్టెంట్ లీడర్ ఇన్ సింగరేణి మండల్, ప్లీజ్ ఎనీ డేట్ డు ఫిక్స్' అని రాసి సంతకం చేసిన ఎమ్మెల్యే సీఎం ఆఫీస్‌కు పంపించారు. కాగా గణేష్ పెళ్లికి సీఎం వస్తారా.. అప్పటి దాకా అతడు పెళ్లి చేసుకుంటాడా లేదా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

జర భద్రం..

- వేసవి సెలవుల్లో తాళం వేసి ఊరెళ్తున్నారా..?
- తప్పక ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే..
- పోలీస్ గస్తీ ముమ్మరం



ఖమ్మంక్రైం: పాఠశాలలు, కళాశాలలు అన్నింటికీ దాదాపుగా నేడో, రేపో వేసవి సెలవులు ప్రకటించనున్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. రెండు నెలల పాటు సెలవులు ఉండటంతో ముందుగానే పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులందరూ పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రణాళిక వేసుకునే ఉంటారు. దీనికితోడు వివాహాలు కూడా ఉండటంతో బంధువులింటికి వెళ్లేందుకు సిద్ధమయ్యే ఉంటారు. అయితే, దొంగల నుంచి తమ సొత్తును రక్షించుకునేందుకు ఇంటికి తాళం వేసి ఊరెళ్లేవారు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పోలీసులు చెబుతున్నారు. లేదంటే అంతే సంగతులు. తిరిగి వచ్చేసరికి ఖాళీ చేసి పెడతారు దొంగలు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా దొంగల సంచారం ఉండటంతో తాళం వేసి ఊర్లు వెళ్లేవారు ఈ జాగ్రత్తలు తప్పక పాటించాల్సిందేనని పోలీస్ శాఖ చెబుతోంది.

- ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్ర పరుచుకోవాలి. లేదంటే తమకు తెలిసిన సురక్షిత ప్రాంతాల్లో దాచుకోవాలి.
- ఇంటి బీరువా తాళాలను తమ వెంట తీసుకొని వెళ్లాలి. విలువైన వస్తువులు, వ్యక్తిగత విషయాలు(తమ వద్ద ఉన్న డబ్బు, నగలు గురించి) ఇతరులతో పంచుకోకూడదు.
- బయట గేట్‌కు తాళం వేయకుండా లోపలి నుంచి గొళ్లెం పెట్టాలి. ఇంటి లోపల, ముఖ్యంగా వరండాలో లైట్లు వేసి ఉంచాలి.
- అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలి. పగలు, రాత్రి సమయాల్లో కూడా వాచ్‌మెన్‌లు ఉండేలా చూసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులను ఒంటరిగా ఇళ్లల్లో ఉంచి పోకూడదు.
- ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే ముందు చుట్టుపక్కల వారికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ముఖ్యంగా శివారుకాలనీలు, అపార్ట్‌మెంట్ల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులు, లేదా డయల్–100కు సమాచారం ఇవ్వాలి.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాం



వేసవి కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండటంతో జిల్లావ్యాప్తంగా పోలీస్ పెట్రోలింగ్ విస్తృతంగా పెంచాం. ప్రత్యేక బృందాలతో రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని జిల్లా పోలీస్ అధికారులను ఇప్పటికే ఆదేశించాం. తాళాలు వేసి ఊర్లకు వెళ్లే ప్రజలు ఇంటి పక్కవారికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విలువైన వస్తువులు, నగదు ఇంట్లో ఉంచి వెళ్లొద్దు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానంగా ఎవరైనా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఆరుబయట నిద్రించేవారు ఇంటి చుట్టూ తలుపులు వేసుకొని జాగ్రత్తగా ఉండాలి. నగలు ధరించకూడదు.

సునీల్‌దత్, సీపీ, ఖమ్మం

బస్సులు, రైళ్లలో ప్రయాణించేవారు..

- ప్రయాణికులు తమ విలువైన వస్తువులు డబ్బు, ఫోన్, లాప్‌టాప్‌లను తమ ముందు పెట్టుకున్న బ్యాగ్‌లో లేదా, ఒంటికి దగ్గరగా ఉంచుకోవాలి.
- బ్యాగులు పూర్తిగా మూసి ఉంచాలి. వెనుక జేబుల్లో వస్తువులు పెట్టుకోకూదు.
- బ్యాగులను కాళ్ల దగ్గర లేదా, ఒడిలో ఉంచుకోవాలి. పైన ర్యాక్‌లపై ఉంచితే వాటిపై నిఘా ఉంచాలి.
- విలువైన వస్తువులున్న బ్యాగులను పైన ఉంచకపోవడం మంచిది. సెల్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌ను అవసరం లేకపోతే బయటకు తీయవద్దు. పబ్లిక్ ప్రదేశాల్లో వాటిని తీసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. వాటికి పాస్‌వర్డ్ వంటి భద్రతా ఫీచర్లు ఉపయోగించుకోవాలి.
- బస్సులు, రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తొందరపడకుండా తమ వస్తువులన్నీ సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి.

కళాక్షేత్రం అభివృద్ధికి కృషి


నాటికలోని ఓ దృశ్యం


హక్కు నాటికను తిలకిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం సాహిత్య రంగానికి కేంద్రంగా విరాజిల్లుతున్న భక్త రామదాసు కళాక్షేత్రం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. నెల నెలా వెన్నెల 93వ కార్యక్రమం ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షత్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. కనుమరగవుతున్న నాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రతి నెలా కార్యక్రమాలను నిర్వహించటం అభినందయమన్నారు. ఈ సదర్భంగా హైదరాబాద్ కళాబృందం ప్రదర్శించిన 'హక్కు'నాటికను ఎంపీ తిలకించారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్ కుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు నాగబత్తిని రవి, కె.దేవేంద్ర, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మెంతుల శ్రీశైలం, మహ్మద్ ముస్తాఫా, రాధాకృష్ణ, జాబిశెట్టి పాపారావు, యాంకర్ రవీందర్, మారుతి కొండల్‌రావు, వీరబాబు, సాయి, శశి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కార్యక్రమాలు

93వ నెల నెలా వెన్నెల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. తొలుత హైదరాబాద్‌కు చెందిన దాశరథి థియేటర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో లఘుచిత్రాలను ప్రదర్శించారు. ఖమ్మం కళాకారుడు నటించిన 'అమ్మ', సినీ నటుడు ఎల్బీ శ్రీరాం నటించిన 'పసుపు కుంకుమ'లఘు చిత్రాలను ప్రదర్శించారు. వడ్డే ఆచరణ కూచిపూడి నృత్యం, నామా ప్రణవికసాయి భరతనాట్యం ఆకట్టుకున్నాయి.

మొక్కజొన్న పంట దగ్ధం


కాలిబూడిదైన మొక్కజొన్న పంట

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రెండు ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన మలాది అచ్చయ్య నారాయణపురం మైనర్ కాలువ పరిధిలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. ఇటీవల గాలిదుమారానికి మొక్కజొన్న నేలకొరిగింది. కూలీల కొరత ఉండడంతో మొక్కజొన్న కంకులు ఇరవడం ఆలస్యమైంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు పక్క పొలాల్లో నిప్పంటించడంతో మంటలు ఈ పంటకు కూడా అంటుకున్నాయి. పంట అంతా కాలి బూడిదవడంతో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.